
కథ

# మంచుతెర

పి. నాగాంజనేయులు



సాయంత్రం ఏడుగంటల సమయం. పట్టణమంతా దీపావళి కన్నులపండువగా వెలుగుతోంది.

వన్‌టౌన్ యస్.ఐ. ప్రభాకర్ భార్యాబిడ్డలతో ఉత్సాహంగా అరగంటనుంచీ పరసబెట్టి టపాకాయలు కాలుస్తున్నారు.

"అప్పా...మీకు ఫోను...పెద్దయ్యగారు" ఆర్డర్లీ మొబైల్ ఫోను అందించాడు.

"హలో ప్రభాకర్... వెంటనే స్టేషనుకొచ్చేయ్. తమిళనాడు పోలీసులు మర్డరు కేసుతో వచ్చారు" విషయం చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

"సర్...ఇప్పుడు బయల్దేరుతున్నాన్సార్..." అని మొబైల్ ఆఫ్ చేసి ఇంట్లోకి వెళ్లాడు ప్రభాకర్. పరిస్థితి అర్థమైంది ఆయన భార్యాపిల్లలకి. వాళ్ల మొహాల్లోని సంతోషం ఇట్లే మాయమైంది.

పది నిమిషాల్లో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ముందు ఆగింది జీపు. నేరుగా ఇన్‌స్పెక్టర్ గదిలోకి వెళ్లాడు.

"రా ప్రభాకర్... ఇదిగో వీళ్లు తమిళనాడు పోలీస్" అంటూ అక్కడున్న ఒక ఎస్సయ్,, ఒక హెడ్ కానిస్టేబుల్, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను పరిచయం చేశాడు ఇన్‌స్పెక్టర్.

"విషయం ఏంటంటే వాళ్ల రాష్ట్రం పొలిమేరలోని ఓ ప్రాంతంలో ఓ యువకుడి శవం దొరికిందట. షర్టు కాలర్ లేబిల్‌పై ఈ వూరి పేరుంది. ఫొటోలూ, పి.యం. రిపోర్టు తీసుకు వచ్చారు" అంటూ అప్పటివరకూ తాను చూస్తున్న ఫొటోలను అందించాడు.

వాటిని నిశితంగా పరిశీలించాడు ప్రభాకర్. బాడీలో మొహం ఆనవాల్లేకుండా చెక్కేశారు.

'షర్టు కాలర్‌కున్న లేబిల్ 'సెవెన్ స్టార్ టైలర్స్' అని ఊరిపేరు స్పష్టంగా రాసుంది.

'ఈ టైలర్ షాపు పాతబస్టాండులో

**దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

ఉందిసార్. డీటైల్స్ కనుక్కుంటాను" అన్నాడు.

"సో మృతుడెవరో, ఐడెంటిఫై అయినంతవరకూ వీరికి సహకరించు! ట్రేసయిన వెంటనే నాకు ఫోన్ చెయి. ఓకే" అని బయల్దేరబోతూ ప్రభాకర్ దగ్గరగా వచ్చి..."సారీ ప్రభాకర్... నీ పండగ ఆనందాన్ని డిస్టర్బ్ చేశాను కదూ"

"పర్లేదు సార్... ఇట్స్ ఓకే! కనీసం మీరైనా ఎంజాయ్ చేయండి" అన్నాడు ప్రభాకర్.

"గుడ్‌లక్" అని షేక్‌హాండ్ ఇచ్చి బయటకి నడిచాడు ఇన్‌స్పెక్టర్.

తమిళనాడు పోలీసులతో భాష ప్రాబ్లం. కానీ ఎస్సైకి ఇంగ్లీషు వచ్చు కాబట్టి తనకు తమిళం రాదన్న బాధ లేదు.

వాళ్లతో కలిసి జీప్‌లో టైలర్‌షాపు వద్దకు వెళ్లాడు. మృతుడిని గుర్తుపట్టాడు టైలర్.

'పేరు హరిబాబు' అని ఇల్లెక్కడో చెప్పాడు.

మృతుడు తమ కొడుకే అని గుర్తుపట్టిన ఆ తల్లిదండ్రుల శోకానికి అంతేలేదు. ఆ తల్లి స్పృహ కోల్పోయింది.

పండగరోజు ఇలాంటి కానుకతో రావడం బాధగా అనిపించింది ప్రభాకర్‌కు.

అనుమానితుల గురించి నోట్ చేసుకొని ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్ చేశాడు.

"వెరీ గుడ్! గో ఎహెడ్! ఏం ప్రాబ్లం వచ్చినా నన్ను కాంటాక్టు చెయ్!" అని ఫోన్ పట్టేశాడు ఇన్‌స్పెక్టర్.

టౌనుకు కొంచెం దూరంగా ఉన్న కాలనీకేసి బయల్దేరాడు ప్రభాకర్ తమిళ పోలీసులతో సహా. ఆ కాలనీలో అన్నీ విడివిడి భవనాలే.

ఓ ఇంటిముందు జీపు ఆపి డోర్ నంబర్ సరిచూసుకుని ఇంట్లోకి నడిచాడు.

కాసేపటి తర్వాత ఆ ఇంట్లోని నలుగురు కుర్రాళ్లతో ముందుకు ఉరికింది పోలీస్‌జీపు.

000

స్టేషన్లో ఇంటరాగేషన్ మొదలయింది.

కోటింగ్ ఏమీ ఇచ్చుకోక ముందే చాలా వివరాలు కక్కేశారు ఆ కుర్రాళ్లు. అందరూ డిగ్రీ ఫైనల్ విద్యార్థులే. మృతుడు హరిబాబును గుర్తుపట్టారు.

కుర్రాళ్లందరూ బాగా భయపడ్డారు. ఒళ్లంతా స్నానం చేసినట్లు చెమటలు పట్టాయి.

'నిజం చెప్తే మీకేం కాదని' హామీ ఇచ్చి వివరాలు అడిగాడు ప్రభాకర్.


తొలి ఏడాది కాలేజీ పరిచయంతో తమ రూమ్‌కు వస్తుండేవాడనీ ఆరునెలల నుంచి రావడం కాస్త తగ్గిందనీ, నెల నుండి అసలు రావడం లేదనీ చెప్పారు.

పక్కింటి ఆవిడతో సంబంధం గురించి అడిగితే, 'తమను తమ్ముళ్లలా చదువుల విషయంలో ప్రోత్సహించేదనీ, చిన్న చిన్న ఆర్థికావసరాలకు ఆదుకునేదనీ' చెప్పారు.

డిగ్రీ తొలి సంవత్సరంలో డబ్బులేక చదువాపేసిన హరిబాబును మళ్లీ చదవమనీ, తాను డబ్బు సాయం చేస్తాననీ నచ్చజెప్తుండేదనీ కానీ హరిబాబు ఒప్పుకోలేదనీ అన్నారు. అంతకు మించి మరే సంబంధం లేదన్నారు.

ఆ కుర్రాళ్లను టూటౌన్ లాకప్‌లో ఉంచి వాళ్ల గదికి చుట్టుపక్కల విచారించాడు ప్రభాకర్.

కాలేజీ కుర్రాళ్ల ఇంటి పక్కన ఉంటున్నది 'హసీనా బేగం', ఉరఫ్ జయలక్ష్మి ఆ కాలనీలో మూడేళ్ల నుంచి ఉంటోందనీ, తొలిభర్త పెళ్లయిన కొన్నాళ్లకే చనిపోగా, కుటుంబ పోషణ కోసం 'గల్ఫ్' వెళ్లిందనీ, అక్కడో ఇండియన్ ముస్లింను పెళ్లి చేసుకుని 'హసీనా బేగం'గా మారి తిరిగొచ్చి ఇక్కడ ఉంటోందనీ చెప్పారు.



## జేమ్స్ బాండ్ నాడు-నేడు

ఇంగ్లీష్ జేమ్స్ బాండ్ పేరుప్రఖ్యాతు లెటువంటివంటే ఎందరో బాండ్‌గా నటించారు. మన వారు 'బాండ్ 007, శాలిమార్' చిత్రాల్లో అతని నకిలీని ప్రవేశపెట్టారు. యుఎస్ అకాడెమీ అవార్డు విజేత హెల్లేబెర్రీతో నిన్నటి బాండ్ రోజర్ మూర్. నేటి బాండ్ పియర్స్ బ్రాన్సన్. లండన్‌లో జరిగిన వరల్డ్ ప్రీమియర్‌కు వచ్చిన పియర్స్ కూడా హెల్లేబెర్రీతో ఫోటో దిగాడు.

ఎస్.

భర్త ఇంకా గల్ఫ్‌లోనే ఉన్నాడనీ నిజానిజాలు తమకూ క్లియర్‌గా తెలీవనీ, ఆమె ఎవ్వరితోనూ కలవదనీ, ఆ కాలనీలో అందరూ ఒకరితో ఒకరు కలవరనీ చెప్పారు.

చాలా విలాసవంతంగా గడిపేదనీ, పక్కింటి కాలేజీ కుర్రాళ్లతో చనువుగా ఉండేదనీ, అంతకు మించి వీళ్లెవరూ తమకు అనుమానాస్పదులు కారనీ చెప్పారు.

అటు నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

'హసీనా' కదలికల గురించి కాపలా ఉంచిన మఫ్టీ కానిస్టేబుల్ నుంచి సెల్‌కు ఫోన్ వచ్చింది.

'మీరటు కుర్రాళ్లను తీసుకెళ్లాక ఈవిడ ఓమారు ఇంట్లోంచి బయటికొచ్చి కుర్రాళ్ల గదికేసి చూసి ఇంట్లోకి వెళ్లిపోయింది సార్. అంతే'

"ఓకే శ్రీనూ. కీపిటప్. ఉదయం ఆమె సంగతి చూద్దాం" అని సెల్ ఆఫ్ చేశాడు ప్రభాకర్.

ఇల్లు చేరేసరికి తెల్లవారుజాము మూడయింది.

000

ఉదయం తొమ్మిదిగంటలకు మఫ్టీలో హడావిడి ఏం చెయ్యకుండా హసీనా ఉరఫ్ జయలక్ష్మి ఇంటికి వెళ్లాడు ప్రభాకర్.

టీవీలో ఏదో ప్రోగ్రాం చూస్తోందామె.

ముప్పై సంవత్సరాలున్నా పాతికేళ్ల అమ్మాయిలా వుంది హసీనా. అందంతోబాటు నిండైన అవయవ సంపద.

ఇల్లు కూడా బాగా లగ్జరీగా ఉంది. హోం థియేటర్, స్టీరియో సిస్టం, ఫోన్ వగైరా విలాసవంతమైన వస్తువులతో డెకరేటివ్‌గా ఉంది.

"రండిసార్... మీరు వన్‌టౌన్ ఎస్సై కదా! కూచోండి" అని సోఫా చూపించింది.

'వన మినిట్' అని ఫ్రిజ్‌లోంచి కోక్ తీసి గ్లాసులోకి ఒంపి ఇచ్చింది.

"రాత్రి పక్కింటి స్టూడెంట్స్‌ను తీసికెళ్లినట్టుంది... ఏంటి? ఏం చేశారు వాళ్లు?" అని అడిగింది.

విషయం సూటిగా చెప్పి ఆమె రియాక్షన్ గమనించాడు ప్రభాకర్, మృతుని ఫోటోను చూపిస్తూ.

అవాక్కయిందామె. ఒక్కసారిగా ఏడ్చేసింది.

"హరిబాబు చాలా మంచివాడనీ, తాను తమ్ముడిలా చూశాననీ డబ్బుకోసం ఆటో శంకర్‌తో కలసి కొన్నాళ్లపాటు మోటార్‌సైకిళ్ల దొంగతనానికి పాల్పడ్డాడనీ, ఆ తర్వాత శంకర్‌తో గొడవలొచ్చి కొట్టుకుని విడిపోయాక 'ప్రాణం తీస్తా'నని శంకర్ బెదిరించాడని తెలిసిందని ఆ దొంగతనాలు మానేసేలా చేసింది తనే"నని ఏడుపు వెక్కిళ్ల మధ్య చెప్పింది.

'తాను అతనిని మార్చాననీ, కానీ ఆకస్మాత్తుగా ఒక నెల నుంచీ బొత్తిగా కనిపించడం లేదనీ'

చెప్పింది.

మోటార్‌బైక్ దొంగతనాల్లో హరిబాబు పార్ట్‌నర్ ఆటో శంకర్ వివరాలు తీసుకుని ఈ కేసులో మీ సంపూర్ణ సహకారం కావాలి... అని బయటకి వచ్చేశాడు.

000

మధ్యాహ్నం మూడింటికి ఆటోవాలా శంకర్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చారు. అప్పటికే భయంతో వణికిపోతున్నాడతను.

"హరిబాబు తెలుసా?" అడిగాడు ఎస్సై.

"తె... తె... తెలు... ఏ హరిబాబు సార్?" భయంతో కంపించిపోతూ తడబడ్డాడు శంకర్.

"మా టైం వృధా చెయ్యకు శంకర్. మోటార్‌సైకిళ్ల దొంగతనాల్లో నీ పార్ట్‌నర్ హరిబాబు గురించి అడుగుతున్నా!"

"ఆс... తెలుసు సార్! కానీ మాకు గొడవలొచ్చి విడిపోయి ఏడాదికి పైనే అయింది సార్"

"ఎందుకు చంపావు హరిబాబును?"

"సార్... నేనా? హరినా... అంటే?" తెల్లమొహం వేశాడు శంకర్.

"హరిబాబు నీకు సహకరించడం లేదని వాడిని చంపావంటున్నాను! అంతేనా" ఎస్సై ఉరుములాంటి కంఠస్వరం, అతనన్న పిడుగులాంటి మాటవిని దిమ్మెరపోయాడు శంకర్.

ఒక్కసారిగా ప్రభాకర్ కాళ్లపై పడ్డాడు.

"సార్... అంత మాట అనకండిసార్. దొంగతనాల్లో సహకరించలేదని తిట్టుకొని కొట్టుకున్నామే తప్ప, ఆ తర్వాత వాడి గురించి నాకేం తెలీదు సార్. దేవునిసాక్షిగా సార్. మా మధ్య అంత పగలేదు సార్"

"సరే! సాయంత్రం వరకూ టైం ఇస్తున్నా! అప్పటకైనా నిజం చెప్పు!" అని శంకర్‌ను లాకప్‌లో వేయించి ఇన్‌స్పెక్టర్ గదిలోకి వెళ్లాడు ప్రభాకర్. కేస్ ఇంప్రూవ్‌మెంట్ గురించి చెప్పాడు.

000

రాత్రి పదకొండు తర్వాత శంకర్‌ను మళ్లీ ఇంటరాగేట్ చేయడం మొదలెట్టాడు.

"సార్... హరిబాబు ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయికీ ఇష్టమేగానీ, ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. వాళ్లది చెన్నూరు సార్. వాళ్లా మధ్య హరిబాబును కొట్టి వార్నింగ్ ఇచ్చారు సార్. బహుశా వాళ్లు చంపి ఉండొచ్చు"

శంకర్ మాటలు నమ్మదగ్గవిగా అనిపించింది ప్రభాకర్‌కు.

చెన్నూరు టౌన్‌కు పదిమైళ్ల దూరంలో ఉన్న చిన్న గ్రామం.

ఉదయానికి హరిబాబు ప్రేమించిన యువతినీ, ఆమె తల్లిదండ్రులనూ స్టేషన్‌కు రప్పించాడు. హరిబాబు గురించి అడిగాడు ప్రభాకర్.

"ఎందుకు సార్! మా బతుకులు బద్నాం చేస్తారు? వాడు మా కులమూ కాదు. చదువూ, సంపాదనా లేదు. మా బిడ్డ వెంటబడితే నాలుగు తన్నకుండా మమ్మల్నడుగుతున్నారు?" అంటూ ఎగిరిపడ్డాడు ఆ అమ్మాయి తండ్రి.

"చంపుతానని వార్నింగ్ ఇచ్చావట కదా!"

"ఆ నాకొడుకు పెళ్లిజేసుకోమని మళ్లీ నా బిడ్డను బెదిరించాడట. దొరికితే మాత్రం నరికిపారేస్తాం సార్! ఆ తర్వాత జైలుకు పోయినా దిగుల్లేదు"

"బేవార్సుగాడని తెలిశాక నేనూ దూరంగానే ఉన్నాసార్. అయినా ఇలా మమ్మల్ని పోలీసుస్టేషనుకు ఈడ్చాడు..." ఏడుస్తూ చెప్పిందా అమ్మాయి.

వీళ్ల మాటల్లో నిజమెంత?

వీళ్లు హరిబాబును చంపివుంటే 'చంపేస్తాం' అని అనరు కదా! అటు ఆటోడ్రైవరు... ఇటు ఈ అమ్మాయి తల్లిదండ్రులు... ఎవరు నిజం చెప్తున్నట్లు?

'హరిగాడు మరో అమ్మాయిని వేధించాడని కంప్లయింటొచ్చింది. గతంలో మీ అమ్మాయినీ ఏడిపించాడనీ తెలిసి పిలిపించాను. ఇక మీరు వెళ్లొచ్చు. మళ్లీ పిలిచినపుడు స్టేషన్‌కు రావాలి' అని వాళ్లను పంపించమన్నట్లుగా సైగ చేశాడు.

వెళ్తూ ఆ అమ్మాయి తండ్రి ఎస్సైకి చేతులు జోడించాడు. "సార్... సామాన్యరైతును. ఆ నా కొడుకు బారి నుండి నా బిడ్డను కాపాడండి స్సార్" అని కళ్లనీళ్లు పెట్టుకొన్నాడు.

"వాడిక మీ జోలికి రాడు. మీకేం భయం లేదు. వెళ్లండి" అని వాళ్లని పంపించేశాడు.

000

జీపు ఆగిన శబ్దం విని బయటికొచ్చింది హసీనా. "రండిసార్... ఏమైనా తెల్సిందా సార్?" ఆతృతగా అడిగింది.

ఆటోడ్రైవర్ విషయం, చెన్నూరు వాళ్ల విషయం చెప్పాడు.

"హరిబాబు ప్రేమ గురించి మీరు నాకు చెప్ప లేదేం?"

ఒక్క క్షణం మౌనం వహించింది హసీనా.

"ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు చెప్పాడు గానీ, వాళ్ల పెద్దలతో జరిగిన గొడవ గురించి నాకు తెలీదు. ప్రేమకు ఇది టైం కాదనీ కెరీర్ ముఖ్యమనీ చెప్పాను. ఆ తర్వాత ఆ విషయం ప్రస్తావనకు రాలేదు"

"పక్కింటి కుర్రాళ్లక్కూడా తెలీదా ఈ విషయం?" అడిగాడు ప్రభాకర్.

'ఏమో సార్. ఫ్రెండ్స్ కదా. తెలిసే ఉంటుంది' కాసేపు ఆగి అడిగింది హసీనా.

"పాపం ఆ కుర్రాళ్లను వదిలిపెట్టరా సార్?!"

"ఇవాళ వదిలేస్తాను. వాళ్లకీ విషయాలేం తెలిసినట్లుగా లేవు. ఆ చెన్నూరు వాళ్లే హరిబాబును హత్య చేసుండాలి. రేపు మళ్లీ పట్టుకొచ్చి నాలుగు తగిలిస్తే చచ్చినట్లు ఒప్పుకుంటారు" తేలిగ్గా నవ్వేస్తూ అన్నాడు ప్రభాకర్.



## సర్వరోగనివారిణి నవ్వు

రోగాలను పారద్రోలేందుకు ఏకైకమార్గం నవ్వటమే! నవ్వు నాలుగు విధాల చేటని ఎవరన్నారో కానీ, ఆ నానుడిని ఇవాళ పూర్తిగా మరిచిపోయి, నవ్వు నలభై విధాల గ్రేటు అనుకోవలసివుంది. నవ్వు మీద పరిశోధనలు నిరంతరం జరుగుతూనేవున్నాయి. నవ్వుకూ, ఆరోగ్యానికీ అవినాభావసంబంధం వుందని తేల్చారు వైద్యులూ, పరిశీలకులూ. మొదటి సారి హార్ట్ అటాక్ వచ్చినవారు కూడా నవ్వుకుంటూ వుంటే రెండోసారి వచ్చే అవకాశాలు చాలా వరకూ తగ్గుతాయంటున్నారు వైద్యనిపుణులు. అలా నవ్వేవారికి మందులు కూడా పెద్దగా అవసరం లేదు. పైగా వారి రక్తపుపోటు కూడా క్రమబద్ధంగానూ, తక్కువగానూ వుంటుంది. నవ్వటం వల్ల రక్తంలోని స్టెరాయిడ్ల శాతం కూడా తక్కువైపోతుంది. బాధలూ, నొప్పులూ తట్టుకునే శక్తి నవ్వటం వల్ల బాగా పెరుగుతుందట. కనుక నవ్వండి, ఆరోగ్యంతో వుండండి!

ఎన్.

## స్ట్రెస్ వల్ల అసిడిటీ

కొందరికి కడుపులో మంట, విపరీతంగా చెమట పట్టటం, మూత్రవిసర్జనలో నొప్పి, మలబద్ధం వుంటాయి. గాభరా పడిపోయి డాక్టర్ల దగ్గరికి వెళ్లి పరీక్షలు చేయించుకుంటే, అన్నీ నార్మల్‌గానే వున్నట్లుగా రిపోర్టులు వస్తాయి. శరీరంలోని బాధలేవీ తగ్గవు. ఈ మంటలు అసిడిటీ వల్ల వస్తాయి. దీనికి ఎక్కువ సేపు ఆకలితో వుంటూ, సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవటమే అతిముఖ్యకారణ మంటున్నాయి పరిశోధనలు. మసాలాలు, కారం, పులుపు తగ్గించటం, మాంసాహారం, తాగుడు మానేయటం తగ్గేందుకు మార్గాలు. తగిన చికిత్స చేయించుకోకపోతే కడుపులోని మంటలు ఆసనం వరకూ పాకి పైల్స్‌గా మారే ప్రమాదం వుంది. కనుక చికిత్స చేయించుకోవటంతో పాటు, క్రమం తప్పకుండా ఆహారం తీసుకోవటం ముఖ్యం. అసిడిటీ వున్నది అనే భావం మనస్సులో పెరిగి స్ట్రెస్‌గా మారుతుంది. స్ట్రెస్ పెరగటం వల్ల అసిడిటీ కూడా రోజురోజుకూ పెరుగుతుంది. కనుక స్ట్రెస్‌ను పెరగకుండా చూసుకోవాలి.



ఎస్.

"ఏమోసార్... అసలే అది ఫ్యాక్షన్ గ్రామం" భయంగా అంది హసీనా.

"నో ప్రాబ్లం. రేపీపాటికి హంతకుడు దొరుకుతాడన్న నమ్మకం ఉంది" అంటూ లేచాడు.

నేరుగా కాలేజీ కుర్రాళ్ల నుంచిన టూటౌన్‌కు వెళ్లాడు. వాళ్లందర్నీ విడివిడిగా ప్రశ్నించాడు హరిబాబు ప్రేమ గురించి.

అందరూ దాదాపు ఒకటే మాట.

"ఆ అమ్మాయివాళ్లు వార్నింగ్ ఇచ్చాక మళ్లీ ఆ అమ్మాయి జోలికి వెళ్లినట్లు లేదనీ... కానీ, ఈ ఒక్క నెలలో ఏం జరిగిందో తెలీదనీ"

"మిమ్మల్ని ఎల్లుండి వదిలేస్తా. కానీ రెండుపూటలా స్టేషన్‌కొచ్చి సైన్ చేస్తుండాలి ఈ కేసు తెగేంతవరకూ" చెప్పాడు ప్రభాకర్.

000

వన్‌టౌన్‌కి రాగానే ఆటోశంకర్ గురించి ఆరా కోసం వంపిన కానిస్టేబుల్ రెడీగా ఉన్నాడు.

"శంకర్‌గాడు బడిపిల్లల బాడుగలకు వెళ్తున్నాడు సార్ రెండుపూటలా. ఆదివారం కూడా పిల్లల్ని ట్యూషన్లకు తిప్పుతున్నాడు. ఆటో యజమానికి అద్దె కూడా రోజూ చెల్లిస్తున్నాడు.

"సరే... నువ్వేం న్యూస్ తెచ్చావు" చెన్నూరు వెళ్లిన కానిస్టేబుల్‌ను అడిగాడు.

"ఒక్కరోజు కూడా గ్రామం వదిలి బయటికి రాలేదు సార్ ఆ ముసలాడు. పొలం పనుల్తో బిజీగా ఉన్నాడు" చెప్పాడా కానిస్టేబుల్. వెళ్లమని సైగ చేశాడా కానిస్టేబుల్‌కి ప్రభాకర్.

'చెన్నూరు వాళ్లకి హరిబాబు హత్య గురించి నిజంగా తెలీదా? లేక నటిస్తున్నారా? ఎవర్నీ నమ్మటానికి లేదు.'

విశ్రాంతిలేకుండా ఈ మూడురోజులూ తిరిగినా తను సాధించింది ఏమిటి? ఆ ఆలోచన రాగానే ఒక్కసారిగా నీరసం ఆవహించినట్లయింది.

'పెద్ద పండగలు కూడా ఒక్క పూటయినా పిల్లల్తో గడవక ఈ పీనుగులాట ఏంటండీ?' అని భార్య విసుర్లు.

'అందరు పిల్లలూ వాళ్ల డాడీలతో పండగ ఎంజాయ్ చేశారు' అని పిల్లల డిజప్పాయింట్‌మెంట్.

ఇదేనా తను సాధిచింది.

పైగా నక్షత్రకుడిలా ఈ తమిళ పోలీసులను వెంటేసుకు తిరగడం. మూడురోజులైనా పరిశోధన ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

బాడీ తమిళనాడులో దొరికినా హత్య జరిగిందెక్కడో తెలీదు. మృతదేహం వద్ద దొరికిన వస్తువులేవీ ఏమాత్రం 'క్లూ' ఇచ్చేవిగా లేవు. ఎవరినీ అనుమానించే పరిస్థితి లేదు.

'హడావిడి తప్ప ఫలితం కనిపించడం లేదు ప్రభాకర్. కమాన్! స్పీడప్!' అని ఇన్‌స్పెక్టర్. డియస్పీ, ఎస్పీలు కూడా కేసు గురించి అడుగుతున్నారంటున్నాడు.

ట్రైనింగ్‌లో ఓ కాన్ఫరెన్స్‌లో 'డిజిపి' చెప్పిన మాటలు గుర్తొచ్చాయి ప్రభాకర్‌కు.

'సమస్యలంటూ ఏమీ ఉండవు. సమాధానాలే సమస్యల ముసుగులేసుకొస్తాయి. ఆ ముసుగు తొలగించడమే మన పని!'

నిజమే.

ఆ మాటలు తలచుకుంటే కొత్త ఉత్సాహం.

సరే! ఈ సమస్యకు సమాధానం ఏ ముసుగులో ఉందో చూడాలి!

000

మర్నాడు ఉదయం నుండీ సాయంత్రం వరకూ చెన్నూరు అమ్మాయి వాళ్ల ఇల్లూ, ఆటో డ్రైవరు శంకర్ ఇల్లూ, కాలేజీ కుర్రాళ్ల గదీ, హసీనా ఉరఫ్ జయలక్ష్మి ఇల్లూ అంగుళం కూడా వదలకుండా గాలించాడు ప్రభాకర్.

చెన్నూరులో ఆ అమ్మాయి బంధువులూ, గ్రామపెద్దలు, తల్లీదండ్రీ నిష్టూరాలు..

ఆటో శంకర్ ఇంట్లో ఆడమగల ఏడుపులూ, పెడబొబ్బలూ. గది చెక్‌చేసే సమయంలో కుర్రాళ్లు టూటౌన్ లాకప్‌లో ఉన్నారు.

హసీనా మాత్రం అన్ని గదుల తాళంచెవులూ ఇచ్చి మరీ సహకరించింది.

ఫలితం శూన్యం!

పరిశోధన ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు.

'ఎక్కడ! ఎక్కడ లోపం ఉంది తన పరిశోధనలో' ఆలోచనలతో బుర్ర తిరిగిపోతోంది ప్రభాకర్‌కు.

'ఎక్కడో బాలెన్స్ తప్పింది'

'అవును! ఈ కేసులు అనుమానితులు నలుగురు. వాళ్లలో ముగ్గుర్ని స్టేషన్‌కు తెచ్చి విచారించాము. ఇక మిగిలింది హసీనా. ఆమెను మాత్రం ఎందుకు స్పేర్ చెయ్యాలి!'

ఓ నిశ్చయానికొచ్చాడు ప్రభాకర్.

ఉదయం మహిళా పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు హసీనాను. అయిష్టంగా వచ్చిందామె.

లేడీ ఎస్సై రఫ్‌గా మాట్లాడడం మొదలెట్టింది. పక్కగదిలోంచి ప్రభాకర్ వింటున్నాడు మాటల్ని.

"మీ ఇంటికొచ్చే హరిబాబుకూ నీకు ఏమిటి సంబంధం?"

"అలా అసహ్యంగా మాట్లాడకండి. హరి నా తమ్ముడిలాంటివాడు" విసుక్కుంది హసీనా.

"ఇంకా ఎందుకు నటిస్తావ్. నాలుగు తన్నాక ఆ కాలేజీ కుర్రాళ్లు నీ గురించి చెప్పేశారు!"

"ఏమిటి? ఏం చెప్పారు" అనుమానంగా అడిగింది.

"నీకూ హరిగాడికి సంబంధం ఉన్న విషయం!"

"ఎవరు! ఎవరు చెప్పిందలా? వాళ్లందర్నీ నా తమ్ముళ్లగానే చూసుకున్నాను. వాళ్లలా చెప్పరు. అంతా అబద్ధం!" స్వరం పెంచి అంది హసీనా.

"నిజమే. రెండ్రోజులు కోటింగ్ ఇచ్చాక ఆ కాలేజీకుర్రాళ్లు నిజం కక్కేశారు. నీకు హరిబాబుకు గల సంబంధం, నీ రాసలీలలు అన్నీ ఏకరువు పెట్టారు. వాళ్ల స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేశాం. ఇంకా బుకాయించి లాభం లేదు" గద్దించింది లేడీ ఎస్సై.

కొద్దిక్షణాలు మౌనం వహించింది హసీనా.

"నిజమే. నేను హరిని ప్రాణంగా అభిమానించాను. దుర్గుణాలతో చెడిపోతున్నవాణ్ణి సంస్కరించాను. అందుకే అతనూ నేనంటే

అభిమానించేవాడు. నాకు భర్త లేకుంటే మేం పెళ్లి కూడా చేసుకునేవాళ్లం"

"మరి అలాంటి దానివి చంపడం ఎందుకు?"

"షటప్!" అరిచింది హసీనా.

"హరి నా ప్రాణం. అతనిపై ఈగవాలితే సహించను. అలాంటిది... నేను అతణ్ణి చంపడమా?"

"చిన్న వయసులోనే భర్తను కోల్పోయాను. దరిద్రపు దానా! అని తిట్టారు తల్లిదండ్రులు. బ్రతకలేక గల్ఫ్ వెళ్లాను. బొంబాయికి చెందిన ఇస్మాయిల్‌తో పరిచయమైపెళ్లి చేసుకున్నాను. అతను పరమశాడిస్టని ఆ తరువాత తెలిసింది. మళ్లీ వస్తానని చెప్పి ఇండియా వచ్చేశాను. ఇలా కాలం గడుపుతున్నాను. ఇంతలో హరి పక్కగదిలో కుర్రాళ్ల కోసం వస్తూ పరిచయం అయ్యాడు. అంతలా అతడిని అభిమానించే నేను హరిని చంపుకుంటానా?" బిగ్గరగా ఏడ్చేస్తోంది హసీనా.

"మరైతే ఎవరు చంపి ఉంటారు హరిని?" అడిగింది లేడీ ఎస్సై.

"ఎవరైనా కావచ్చు! చెన్నూరువాళ్లు, ఆటో శంకర్... మరీ ముఖ్యంగా నా ప్రస్తుత భర్త ఇస్మాయిల్! ఎవరైనా కావచ్చు!"

"సరే! నువ్వెళ్లవచ్చు!" అని హసీనాను పంపించేసి లోనికొచ్చింది లేడీ ఎస్సై.

"థాంక్యూ ఫర్ యువర్ కోపరేషన్. అంతా రికార్డ్ చేశాను" ఆడియో క్యాసెట్ జేబులో వేసుకుంటూ అన్నాడు ప్రభాకర్.

"ఏమైనా ఫలితముందా సార్!"

"వైనాట్! కథ అనుకోని మలుపు తిరిగింది. నా ప్లాను తొలిభాగం సక్సెస్! తీగ దొరికింది. ఇక లాగడమే ఆలస్యం" ఉత్సాహంగా చెప్పాడు ఎస్సై ప్రభాకర్.

హసీనాను ఫాలో అవుతున్న కానిస్టేబుల్‌ని సెల్‌ఫోన్లో కాంటాక్ట్ చేశాడు.

"ఎనీ రాంగ్ మూమెంట్?"

"నోసార్! ఇంతవరకూ అంతా మామూలే! అనుమానించదగ్గదేం లేదు!"

"ఓకే సీయూ!" అంటూ సెల్ జేబులో కుక్కి స్టేషన్‌కి వెళ్లాడు. ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఆ గదిలో తమిళ ఎస్సై కూడా ఉన్నాడు.

"హసీనా హరిబాబుల లవ్‌స్టోరీ కొత్తమలుపే! కానీ అంత పిచ్చిగా లైక్ చేసే హరిని ఆమె చంపుతుందా అని? కేసు ఇంకో ముడిపడింది. అంతేగానీ మనకు పనికొచ్చే 'క్లూ' ఏదీ దొరకలేదు కదా! పైగా హరిబాబు చెన్నైలో తేలడమేంటి?" ఇన్స్‌పెక్టర్ ప్రశ్నలు సంధించాడు.

"గల్ఫ్‌లోని హసీనా భర్త ఇండియా కొచ్చా డేమో.

## చాయ్... గరం గరం చాయ్!

టీ కాఫీ కన్నా మంచిదని తెలుసు కానీ ఇప్పుడు కొత్తగా తేలిన సంగతేమిటంటే, ఆంటీ ఆక్సీడెంట్‌గా టీ పని చేస్తుందని. గ్రీన్, బ్లాక్ టీలు తాగటం వల్ల శరీరంలోని కణాలకు భద్రత ఏర్పడుతుందట. అంటే టీలోని పాలీఫినోల్ అనే ఆంటీ ఆక్సీడెంట్, తక్కిన ఆంటీ ఆక్సీడెంట్ల కన్నా ఏమీ తీసిపోదు అంటున్నారు. తాజా పళ్లు, కూరగాయల్లో లభించే ఆంటీ ఆక్సీడెంట్ల కన్నా టీలో పున్నవి ఎక్కువ మేలు చేస్తాయట. బ్లాక్ టీలోని లక్షణాలు కొలెస్టరాల్ ఆక్సీకరణం చెందకుండా రక్షిస్తాయట. ఆక్సీకరణం వల్ల ఆర్థోక్లోరోసిస్ పెరుగుతుంది. టీ వల్ల అది తగ్గుతుంది. టీ తాగేవారిలో హృదయరోగాలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది. గ్రీన్ టీ తాగటం వల్ల విరేచనాలు, తలనొప్పి, హైపర్ టెన్షన్లకు కూడా ఉపశమనం కలుగుతుంది. క్రమబద్ధంగా టీ తాగటంతో ఊపిరితిత్తులు, పాంక్రియాస్, ప్రోస్టేట్ గ్రంథిని కాపాడటమే కాక, కొలోన్ కాన్సర్ రాకుండా నిరోధిస్తుందట.



ఎన్.

ఈవిడతో తిరుగుళ్లు తెలిసి వాడిని అక్కడికి తీసుకెళ్లి చంపాడేమో! అఫ్‌కోర్స్... చంపించాడేమో! ఇక వేరే ఛాన్స్ లేదు. హసీనాను కూల్ చేసి వాళ్లాయన ఫోటో పట్టుకొస్తా. ఆ తర్వాత చూద్దాం."

"ఆ కాలేజీ కుర్రాళ్లకా హసీనా ప్రేమకథ తెలిసీ ఎందుకు చెప్పలేదు?" తమిళ ఎస్సై అడిగాడు.

"అదీ తేలుతుంది!" అంటూ లేచి ఇన్‌స్పెక్టర్‌కి సెల్యూట్ చేసి బయటికొచ్చాడు ప్రభాకర్.

ఐదునిమిషాల్లో టూటౌన్ చేరాడు.

సెల్‌లో ఉన్న నలుగుర్నీ గూబ గుయ్‌మనిపించాడు.

"చెప్పండి! చెప్పండ్రా! హసీనా హరిబాబుల ప్రేమకథ మీకు తెలిసీ ఎందుకు చెప్పలేదు?"

చిగురుటాకుల్లా వణికిపోయారందరూ.

"నిజంసార్... మాకు తెలీదు"

"నోర్మూయండ్రా! హసీనా స్వయంగా ఒప్పుకున్నదీ విషయం. ఆమెభర్తే ఈ హత్య చేయించాడు. వాణ్ణి పట్టుకోవడం కోసం వెళ్తున్నా!"

"సార్! ఆమెవల్ల హరిబాబు చాలా మారిపోయాడుసార్. ఆమెను పెళ్లి చేసుకుంటే ఇంకా బాగుపడతాడని అనుకున్నాం. ఇప్పుడు ఎటూ చనిపోయాడు కాబట్టి ఆ విషయం చెప్పడం ఎందుకని చెప్పలేదు. అంతకుమించి ఏ దురుద్దేశమూ లేద్సార్!" అని చేతులెత్తి దండం పెట్టారు ఆ కుర్రాళ్లు.

అక్కడ నుండి నేరుగా హసీనా ఇంటికి వెళ్లాడు ప్రభాకర్.

గేట్లోనే ఎదురైందామె.

"సారీ హసీనా! నేను ఊళ్లో లేనప్పుడు మావాళ్లు చాలా రూడ్‌గా బిహేవ్ చేశారని తెలిసింది. బాగా తిట్టి వచ్చాను అందర్నీ. అ యామ్ సో సారీ!" అపాలజీ చెప్పాడు ప్రభాకర్.

"మీ పోలీసులకు ఎంత చేసినా ఇంతే లెండి!" ముక్కు ఎగబీలుస్తూ ఏడుపును ఆపుకుంటూ అన్నదామె. ఓదార్చే ప్రయత్నం చేశాడు.

"గల్ఫ్‌లోనే ఉండి మీ ఆయన ఈ హత్య చేయించి ఉంటాడు. అయినా అతడిని వదలను. అతని ఫొటోలేమైనా ఉంటే ఇవ్వండి" అని అడిగాడు.

లోనికివెళ్లి రెండు మూడు ఆల్బమ్స్ తెచ్చి ఇచ్చింది హసీనా. అందులో కొన్ని ఫొటోలలో భర్తను చూపించింది. స్మార్ట్‌గానే ఉన్నాడతను.

"ప్లీజ్... జరిగిందానికి మరోసారి మన్నించమని అడుగుతున్నాను. ఇన్‌స్పెక్టర్‌గారికి చూపించి ఈ ఆల్బమ్స్ గంటలో తెచ్చిస్తా! ఓకే!" అంటూ బయటికొచ్చేశాడు ప్రభాకర్.

ఇన్‌స్పెక్టర్, తమిళ ఎస్సై, ప్రభాకర్ అందరూ చూశారా ఆల్బమ్స్. అందులోని ఫొటోలన్నీ గల్ఫ్‌లో తీసినవే. కానీ నాలుగైదు ఫొటోలు పక్కగదిలోని కాలేజీ కుర్రాళ్లతో 'న్యూఇయర్, హసీనా బర్త్‌డే'ల సందర్భంగా తీసుకున్నవి.

ఫొటోలు చూస్తున్న తమిళ ఎస్సై ఒక్కసారిగా ఎగిరి గంతేశాడు. "గాటిట్! ఐ గాటిట్!"

అందరూ ఆశ్చర్యంగా అతనివైపు చూశారు.

"యూ సీ దిస్ ఫొటో సార్..." అంటూ ఓ ఫొటో చూపించాడు. హసీనా బర్త్‌డే సందర్భంగా తీసిన ఫొటో అది. రెండునెలల క్రితం తీసినట్లు తేదీ కూడా ఉందా ఫొటోపైన.

హసీనా డబుల్‌కాట్‌పై కూర్చొనుండగా తీసిన ఫొటో అది. అందులో ఏముందని అలా అరిచాడో అర్థం కాలేదు వాళ్లకి, అదే అడిగారు.

వెంటనే తన హ్యాండ్‌బాగ్‌లోంచి మృతుని ఫొటోలు తీశాడు. "ఇదిగో ఈ ఫొటో చూడండి. ఈ ఫొటోలో డెడ్‌బాడీకి చుట్టిన దుప్పటీ, ఈ ఫొటోలో ఆమె మంచంపై దుప్పటీ ఒక్కటే!"

మంచుతెర కొంచెం కరిగినట్లనిపించింది.

"హరి మర్డర్ హసీనా ఇంట్లోనే జరిగిఉండాలి!" తమిళ ఎస్సై అన్నాడు.

"అఫ్‌కోర్స్! కానీ హసీనా ఇంటికి ఆ కుర్రాళ్లు తప్ప ఎవ్వరూ వెళ్లినట్లు లేదుకదా. అంటే" ఆగిపోయాడు ప్రభాకర్.

మంచుతెర వీడి అస్పష్టదృశ్యం స్పష్టమౌతున్న ఫీలింగ్.

"అవును. హసీనా. ఆ కుర్రాళ్లు కలిసే చంపి ఉంటారు" అన్నాడు ప్రభాకర్.

కానీ అంతపగ వారికి హరిపై ఎందుకున్నట్లూ?

"ఓకే ఆ డౌటూ తీరుతుంది" అని స్టేషన్ నుంచి బయటికొచ్చాడు. ఇన్‌స్పెక్టర్‌తో సహా అందరూ కలిసి టూటౌన్‌కి వెళ్లారు.

సెల్‌లోకి వెళ్లగానే నిమిషంపాటు చితక్కొట్టాడు ఆ కుర్రాళ్లని... ఎస్సై ప్రభాకర్. "చెప్పండ్రా! హసీనా మిగతా విషయం కూడా చెప్పేసింది. హరి ఆమెకు దక్కబోతోందని మీరే వాణ్ణి చంపేశారట కదా" కోపంతో ఊగిపోతున్న అతణ్ణి చూసి నీరుకారిపోయారు కుర్రాళ్లు.

"సార్... కొట్టందండ్సార్. నిజం చెప్పేస్తాం సార్!" అంటూ చెప్పడం మొదలెట్టారు వాళ్లు.

"హరిని హసీనా చంపిందిసార్.. హరి హసీనాను పెళ్లి చేసుకోను అన్నాడని ఆమె వాడితో పెద్దగా గొడవ పడిందిసార్. హరి మాత్రం ఆ చెన్నూరు అమ్మాయినే చేసుకుంటానని పట్టుబట్టాడు. అడ్డం తిరిగాడు. హసీనాను కొట్టాడు. ఆ తరువాత ఇంటికి రావడం మానేశాడు"

"క్షమాపణ అడగడానికి మాద్వారా హరిని పిలిపించి 'అన్నీ మర్చిపోదాం' అని అందరికీ డిన్నర్ ఇచ్చింది. హరి తినే బిర్యానీలో విషం కలిపింది. వాడు పడిపోయాక రక్తం చిందకుండా దుప్పటి చుట్టి గుండెల్లో చితకపొడిచింది.

శవాన్ని మంచంపై వుండే దుప్పట్లో చుట్టి చీకటిపడే వరకూ ఆగి స్టేడియం దగ్గర్నుంచి కారు దొంగిలించుకొచ్చాము. మాలో ఇద్దరికి డ్రైవింగ్ తెలుసు. ఎవరూ చూడకుండా ఇంట్లోంచి శవాన్ని కొంచెం దూరం మోసుకుపోయి కాస్త ఎడంగా ఉంచిన కార్లో వేసుకుని చెన్నై వెళ్లాం. దార్లో వాడి మొహం గుర్తుపట్టకుండా చెక్కేసింది హసీనా. చీకట్లో ఏదో ఏట్లో కత్తి పారేసింది.

చెన్నై పొలిమేరల్లోని ఓ గ్రామం బయట శవాన్ని వడేసి మరో టౌన్లో కారును వదిలేశాం. ఇక్కడ బయల్దేరప్పుడే నంబర్‌ప్లేట్లు మార్చేశాం.

అక్కడినుండి అద్దెకు కారు మాట్లాడుకొని తెల్లారేసరికి అందరం ఊరు చేరాం. హత్య గురించి తెలిస్తే ఏం చెప్పాలో అందరం కూడబలుక్కున్నాం. మేం సహకరించాం తప్ప ఆ హత్య చెయ్యలేదు సార్" భోరున ఏడుస్తూ ప్రభాకర్ కాళ్లను చుట్టేశారా కుర్రాళ్లు.

"అలాంటివనికి మీరెందుకురా సహకరించడం?" గద్దించాడు ప్రభాకర్.

ఒక్క నిమిషం పాటు ఎవ్వరూ మాట్లాడలేదు.

"ఇంత జరిగాక ఆ కొంచెం ఎందుకురా దాచడం. నిజం చెప్పేద్దాం" అని వాళ్లలో ఒకడు చెప్పడం మొదలెట్టాడు.

"హసీనాతో మాక్కూడా శారీరక సంబంధా లున్నాయి సార్...ఈ విషయం తెలిసి మాతోపాటు హసీనాను కొట్టాడు హరి. చంపేస్తానని బెదిరించాడు. అందుకే హసీనాను పెళ్లిచేసుకోనన్నాడు. అదే హసీనాకు కోపం. అందరం కలసి ఆలోచించి చంపేశాం సార్"

బర్త్‌డే ఫొటోను, డెడ్‌బాడీకి చుట్టిన ఫొటోనూ ఆ కుర్రాళ్లకి చూపించాడు ప్రభాకర్.

"అవున్సార్... ఆ మంచంపై ఉండే దుప్పటీ ఇది. దీంట్లోనే చుట్టి శవాన్ని పారేశాం"

"హత్య చేసిన హసీనా గానీ, సహకరించిన మీరు గానీ ఏ మాత్రం క్లూ దొరక్కుండా వారం రోజులు మెయింటైన్ చేశారు గదరా! మీ ధైర్యానికి మెచ్చుకోకుండా ఉండలేను" అని లేచాడు ఎస్సై ప్రభాకర్.

భారీ కోటింగ్ ఇవ్వగా ఆ కుర్రాళ్లు నిజాలన్నీ కక్కేశారని వాళ్లు చెప్పిన కథంతా వినిపించాడు ప్రభాకర్ హసీనాకు.

భోరున ఏడుస్తూ హత్య చేసింది తనేనని ఒప్పుకొంది హసీనా! స్టేషన్‌కు తరలించారామెను.

000

కారు పోయిందని స్టేషనుకు కంప్లయింట్ వచ్చిన రోజే దాని గురించి ఆరాతీసుంటే ఈ కేసు 'ఫొటో క్లూ' వరకూ ఎదురు చూడాల్సి వచ్చేది కాదు. మనం కంప్లయింట్స్ విషయంలో కూడా కొంచెం సీరియస్ అవాలి' ఇన్‌స్పెక్టర్ ఎస్సై ప్రభాకర్‌ను అభినందిస్తూ అన్నాడు.

తమిళ పోలీసులు హసీనాతోసహా నలుగురు కాలేజీ కుర్రాళ్లనూ తీసుకెళ్లిపోయారు.

000

తాను అంత పరిశోధన చేసినా కేసును క్లియర్ చేసిన ఆ 'ఫొటో క్లూ' ను పట్టుకొంది ఆ తమిళ ఎస్సై. అందుకే ఈ కేసు సాల్వ్ కావటంపట్ల అంత తృప్తిగా లేదు ప్రభాకర్‌కు.

ఫొటోలోని దుప్పటిని గమనించడంద్వారా కేసుని ట్రేస్ చేసిన ఆ తమిళ ఎస్సై సునిశిత పరిశీలనా శక్తికి మనసులోనే జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయాడు. ■

# ఆలోచనశక్తికి వ్యాయామం

వ్యాయామం కండలు పెంచుకునేందుకూ, పోటీల్లో పాల్గొనేందుకూ అని సాధారణంగా అనుకుంటుంటాం. కానీ వ్యాయామం వల్ల శరీరానికే కాక మెదడుకూ చాలా ఉపకారం జరుగుతుంది. తగిన సమయంలో మంచి నిర్ణయాలు తీసుకునేందుకు ఆలోచించే శక్తి బాగా పెరుగుతుందట వ్యాయామం వల్ల. కొందరు 18 నుంచి 24 ఏళ్లున్న స్త్రీపురుషులను పరిశీలించి చూస్తే, వ్యాయామం చేసేవారిలో, చేయనివారి కన్నా ఆలోచనశక్తి పెరిగిందని తెలుసుకున్నారట. వ్యాయామం వల్ల మెదడు కూడా చాలా చురుకుగా తయారైందట. వారడిగిన ప్రశ్నలకు వ్యాయామం చేసినవారు చటుక్కున సమాధానాలు చెప్పగలిగారట. రోజూ పది నిముషాలు తేలికైన వ్యాయామం చేయటం వల్ల మూడ్స్ కూడా క్రియాశీలంగా మారుతాయట. అంతే కాకుండా రోజూ మెట్లు ఎక్కి దిగటమనే వ్యాయామం వల్ల కొలెస్టరాల్ కూడా తగ్గుతుంది.

ఎన్.

